# "పొట్టోడు కని ఆరె సాంబయ్య గట్టోడే"

ఐదు గజాలకంటె కొంచెం తక్కనే ఎత్తుంటడు కని గట్టిగ సిట్టపురేతోలుంటడు ఆరె సాంబయ్య నా సిన్నప్పటికెల్లి సూత్తన్న గప్పటికున్ను గిప్పటికి పెద్దగ తేడలేదయినె శరీరంల. దొడ్డు ధోతి, నేసిన బట్టతోని కుట్టిన బనీనేసుకుంటడు. చీమల పాటలకెల్లి మా ఊరికి రోజు కల్లుదాగుటానికత్తడు. దొడ్డు పెదువులు, కండ్లు లోతుకు పొయ్యి ఉండి లేనట్టుంటయి. సెవ్వులెప్పటికో మొక్కి సుట్టుంటది. సాంబయ్య బజారుపొంట పోతంటె సిన్నపొల్లగాండ్లంత అటీటు ఉరుక్కుంట బక్క[42] గొర్రెకు బ్యారం జేసెర కొచ్చాల మచ్చయ్య. తాగిన సుట్టా మల్ల దాగెరా ఆరే సాంబయ్య! పాడుతరు. సాంబయ్య నవ్వి పొల్లగండ్లను కొట్టచ్చినట్టచ్చి బెదిరిచ్చి ఎల్లిపోయెటోడు. తాగిన చుట్టను మల్ల దాగెటోల్లను సానమందినే సూసిన గని గీపాట గా ఆరె సాంబయ్యొక్కని మీన్నే ఎందుగ్గట్టిండా నా కంతాలోసించినా తెలువపొయ్యేటిది. నా సోపతి పోరగాండ్లను గీ మాటడుగుతె మాగ్గూడ తెలవదనెటోల్లు. సెవ్వుల సుట్టుంటదని గట్లందురు గావచ్చని నా అండ్ల నేనే అనుకున్న. గా సాంబయ్యంటె మా ఊళ్ళందరికి చులుకన బావముండుడు నేంజూసిన. సిన్నోల్లు గట్టెగురుతె పెద్దోల్లు ఆరె పొట్టోడని అనెటోల్లు గని పేరువెట్టివ్వలు పిలువకపోదురు.

ఆరె సాంబయ్యేం జేత్తడో నాకు సానొద్దుల్దాక తెలువకే పొయ్యేటిది. ఓ నాడు మా ఊళ్ళె తోలుబొమ్మలాటలాడుతంద్రు. నేనప్పుడెన్మిదో తొమ్మిదో సదువుతన్న. టిక్కట్టు కొనుక్కోని లోపలికి పెయిన. రామాయణమాట నడుత్తంద. గండ్ల బొమ్మలెగురుతంటె పాటవాడెటోల్లెవ్వలో కాదు ఆరె సాంబయ్యే. బొమ్మల నడుమ రామాయణ యుద్ధం నడుత్తంటె గా యుద్ధాన్ని బ్రహ్మాండంగ వర్ణిత్తండారె సాంబయ్య.

సాంబయ్య కంఠం టంగుమంటంది. రాగం చాల బాగుంది. ఆటకు తగ్గట్టు పాట బలే జోరుగ పాడుతండు సాంబయ్య. గా పాటనింటుంటె నా కాశ్చెర్యమయింది. ఔనెడంత గూడలేనారె సాంబయ్య, తాగిన సుట్ట మల్ల తాగుతడని, పొట్టోడని సులుకనగ పిల్వబడేటి సాంబయ్య, మురికి మురికి గుండె సాంబయ్య, రోజు కల్లుదాగె సాంబయ్య గంత మంచిగ పాటవాడుతడనుకోలే నేను. ఆరె సాంబయ్యల గప్పుడు నేనో గొప్ప కళాకారున్ని జూసిన. గంత మంచి పాటకాడైన సాంబయ్యను ఊరోల్లంత ఎందుకు గట్ల సులుకన సేత్తరో నాకెంత కరుతం గాలే. గా పాట పాడుడు వింటంటె గయినె సదువుకున్నడనుకున్న. గా మాటే తెల్లారి మా నాయిన్న నడిగిన.

"గాల్లకు సదువేడిది బిడ్డ! గీ ఆట-పాట ఒగల్నుంచొగలకత్తది. ఈల్ల పూర్వులు మునుపు మరాటువాడకుండెటోల్లు. ఈల్ల తండ్రులు గీ తోలుబొమమ్మలాటతోనే బతికిండ్రు. ఇప్పుడాల్లు గూడ గీ దీనితోనే బతుకుతండ్రు. తాతలు తండ్రులకు, తండ్రులు కొడుకులకు గిట్ల ఒగల్నుంచొగలకు గీ వృత్తి వాళ్ళకత్తంది. తోలు బొమ్మలను మస్తు ఆడిత్తడు సాంబయ్య. సూసుటానికి కట్లున్నడు గని మాదండి కళుందీ పాట్టోని దగ్గెర" అని సెప్పిండు మా నాయిన్న.

"ఇన్నొద్దు లెప్పుడాడపెయిరిగదీ వూల్లే!" అన్న.

"ఈల్లు మన తెలుగుదేశమంత తిరుక్కుంట గీ తోలుబొమ్మలాడిత్తరు. ఓటి రొండు సార్లిక్కడ గూడా మా ఆడిండ్రు. నువ్వు సూల్లేదు గావచ్చు. సూసినా సిన్నపిల్లగానివి గద యాదికి లేదు గావచ్చు. పాట్టొడే గానీ వీడు గటోట్టఉ. బాల నాగమ్మాటల పరుదమీదికి మాయలఫక్కీరచ్చిండంటె మాయజ్జేడు పాటతోని సాంబయ్య" అని సాంబయ్య గురించిన్నెన్నో సంగతులు జెప్పిండు మా నాయిన్న.

గా ఆట సూసినప్పట్నుంచి నాకు గౌరవం పెరిగింది. పోరగాండ్లను సాంబయ్యనేమనద్దంటె "ఆడు నీకేమన్న సుట్టమార! మా గడ్డమత్తన్నవు!" అని నన్నే గద్దరిచ్చెటోల్లు. అటెనుక రొండు మూడు మట్ల సాంబయ్యాట జూసి, పాట విని సంబురపడ్డ.

నేను కాలేజీ సదువులకు పెయినంక నాలుగైదేండ్లు నాకు కనవడలేదు సాంబయ్య. ఈ నడుమయినె ఆట గూడ సూల్లేదు. నేను డిగ్రయిపోయినంక సెలువులల్ల ఇంటికచ్చిన. సాంబయ్యం జూడక ఐదేండ్లాయె.

నెత్తిమీద గంప పెట్టుకొని "మామిడిపండ్లు మామిడిపండ్లు" అని కేకలేసుకుంట తిరుగుతున్న సాంబయ్య కనవడ్డడు. మా ఇంటిముంగటికెల్లిపోతంటె పిల్సిన.

"కొంటవా అల్లుడ" అని గంప దించిండు.

"ఏంది సాంబయ్య గీ పన్జేత్తన్నవు?" తోలుబొమ్మలాడిచ్చుడేమయింది" అన్న నేను.

సాంబయ్య మొకం నల్లగయింది. ఏదో పోగొట్టుకున్నోనోలే దీనంగ మొకం బెట్టిండు. కనుకొలులల్ల నీళ్ళు కనవడ్డయి.

"ఏం జెప్పాలె సారు మీకు. గిప్పుడు గా పనితోటి బతుకుడు కట్టమయితంది. సినుమాలు సూసుటానికెవడ్డరు జెనాలు. సిన్నసిన్న పల్లెటూల్లల్ల గూడ డబ్బాలెచ్చి సినిమాల్జూపెట్టవట్టి. ఇగ మా తోలుబొమ్మలాటలెవ్వలు జూత్తరు సెప్పు? ఎప్పుడన్నాడినా గని మాకు కైకిలన్న పడుతలేదు.

గెందుకోసురం ఇగ ఆడుడే బందు జేసినం. మా మ్యాలమోల్లమంతెక్కడోల్లమక్కడ[12] చిందర వందరయినం. ఎవ్వలకు సాతనయిన పనాల్లు సేసుకుంటంద్రు. కందగడ్డ, జాంపండ్లు, సింతపలుకపండ్లు, తాటిముంజలు, మామిడిపండ్లు గిట్ల ఏకాలంల దొరికేటి యా కాలంల అమ్ముకుంట బతుకుతన్న. పొట్టకు మా ఎల్లుతంది" అన్నడు సాంబయ్య.

గంత మంచి కళ మూలకు పడుడు నాకే ఎంతో బాదగుంది. దాంతోనే బతికిన సాంబయ్యసొంటోల్లెంత బాద పడుతంద్రో అనుకున్న. కళ మూలకు పడుడు నాకు చాలా కష్టంగుంది. కొంతసేపు మాట్లాడి సోలెదన్ని అడ్లుదెచ్చి మామిడిపండ్లు కొని సాంబయ్య నెల్లగొట్టిన.

అటెనుక పదేండ్లకు మా ఊరిబస్సుల కన్నాగురం పోతంటె చీమలపాలు కాడ బస్సెక్కుకుంట కండ్లవడ్డడు సాంబయ్య. నెత్తిమీద రేకుడబ్బ నెత్తుకున్నడు. అండ్ల నీల్లున్నయి. అటీటు తొనుకుతన్నయి. ఆయాసపడుకుంట బస్సెక్కి డబ్బ బస్సుల వెట్టిండు. అండ్లున్న సాపలు చెంగుచెంగునెగురుతన్నయి. మీదికెల్లి బట్టగట్టుంది.

"ఏం సాపలోయ్ పొట్టయినె. కన్నాగురంలమ్ముతవా?" అన్నడు కండక్టర్

"బొమ్మెలు, కొర్రమట్టలు, జెల్లలు, పాపెరగున్నలన్ని తీర్లయున్నయి. కన్నాగురంలనయితె దరవడుతదని కొంచవోతన్న" అని పైసలిచ్చిండు సాంబయ్య. కండక్టరు సాంబయ్యకు టిక్కటు, లగేజ టిక్కటు కొట్టిచ్చిండు.

నా పక్కపొంటి నిల్సున్న సాంబయ్యతో నన్న నేను "గిప్పుడు గీ పన్జేత్తవా సాంబయ్య......'

"పొట్ట తిప్పలకు జెర్రిపోతులాటసారు. ఏదో ఓటి సేసి కడుపునింపుకోవాలె. గా తోలుబొమ్మలాటల ఎల్లుమాను గాకుంటె పండ్లమ్మిన. కని సైకిల్లమీన తిరుక్కుంట సేపులు, సంత్రాలమ్ముతంద్రు. గాల్లముందట మా కందగడ్డ, గిట్టమ్ముతె గిట్టుతలేదు. ఇగ గీ పన్దొరికిచ్చుకున్న. గిండ్ల మంచిగనే గిట్టువాటయితంది" అని కన్నాగురం పొయ్యేదాకదోటిదోటి సెప్పుతనే ఉన్నడు సాంబయ్య.

సాంబయ్య ఏదో పనితోని బతుకుతన్నా అయినె దగ్గెరున్న గొప్పకళ పొట్ట గూడ నింపుతలేదని యాదికచ్చినప్పుడల్ల మనుసుల కెలికినట్టయితది. పతనమవుతున్న జానపదుల కళలు, మందెచ్చులవాల్ల మిత్తిరయ్యోర్లు, బుడిగెజంగాలు, శారదకాల్లు, చిందు బాగోతులు.......ఎన్నో ఎన్నో నా కండ్లముందు కదిలి కండ్లపొంటి నీల్లత్తయి.

☆ ☆ ☆